క్లుప్తంగా

వ్యాయామ కళాశాలకు నూతన అభివృద్ధి కమిటీ



నూతన కమిటీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు నూతన అభివృద్ధి కమిటీ నియమించారు. ప్రెసిడెంట్‌గా పూజారి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా కొండేటి హనుమంతు నియమితులయ్యారు. కార్యదర్శిగా ముప్పాళ్ల గోపాలకృష్ణ జాయింట్ సెక్రటరీగా ఏనుగు అచ్చారావు, సభ్యులుగా సింహాద్రి సతీష్, బజారు గణేష్, కేబుల్ శ్రీనును దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో నియమించామని టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ వివరించారు. బుధవారం కళాశాలలో నూతన కమిటీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేలు, లెక్చరర్లు సత్కరించారు.

పరీక్షల నిర్వహణ తనిఖీ



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ

దెందులూరు: దెందులూరు ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహిస్తున్న ఎస్ఏ టీఎంపీ 1 పరీక్షల నిర్వహణ తీరును దెందులూరు మండల విద్యాశాఖ అధికారి కె.అన్నమ్మ తనిఖీ చేశారు. 8, 9,10 తరగతులకు బుధవారం బయాలజీ పరీక్ష నిర్వహించారు. హాజరు రికార్డును, విద్యార్థుల హాజరు సంఖ్యను తనిఖీ చేశారు. దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు ఉన్నారు.

భూముల రీసర్వే నిర్వహిస్తాం



చేబ్రోలు ఖండ్రిక రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దారు ప్రసాదు

ఉంగుటూరు: చేబ్రోలు ఖండ్రికలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు ప్రసాదు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ చేబ్రోలు కండ్రికలో భూముల రీసర్వే నిర్వహిస్తామని వెల్లడించారు. వీఆర్వోలు, ఆర్ఐ దావీదు రాజు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం ఎంఈవోగా రాజేష్



రాజేష్‌ను అభినందిస్తున్న ఎంఈవోలు బాలయ్య, రామకృష్ణ సిబ్బంది

గణపవరం: గణపవరం ఎంఈవో-1గా ఎస్. రాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం పెంటపాడు పోస్ట్ బేసిక్ స్కూలు ప్రధానోపాధ్యాయునిగా, వీరవాసరం మండల విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గణపవరం ఎంఈవోగా పనిచేసిన పుచ్చల శేషు గత నవంబర్ నెలాఖరున పదవీ విరమణ చేయడంతో ఆస్థానంలో ఇన్‌ఛార్జి ఎంఈవోగా రాజేష్ నియమితులయ్యారు. ఈసందర్భంగా రాజేష్‌ను గణపవరం ఎంఈవో-2, పెంటపాడు ఎంఈవో టీవీ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది అభినందించారు.

సాంస్కృతిక పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ



బుర్రకథ ప్రదర్శనలో అల్లు శ్రీను బృందం

ఉంగుటూరు: విజయవాడ మాకినేని భవన్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి సంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఉపాధ్యాయుడు అల్లు శ్రీను రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొని బాలకార్మికుడు మూకాభినయంలో ప్రతిభచూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. జాన్సీ లక్ష్మీబాయి బుర్రకథ ప్రదర్శనలో అల్లు శ్రీను టీం రాజారావు, సోని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి జనవరి 4,5 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో బహుమతులు ప్రదానం చేస్తారని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపు సాధించినందుకు తోటి ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి నిమ్మగడ్డ రవీంద్రభారతి, భాస్కర్‌కుమార్ అభినందించారు.

అన్నదాతకు వాయుగండం

- నెలరోజుల్లో మూడో వాయుగుండం
- వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాత కుదేలు
- చిరుజల్లులతో వ్యవసాయదారులకు కంటిమీద కునుకులేని వైనం

గణపవరం: ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మంగళ, బుధవారాల్లో వాతావరణం పూర్తిగా చల్లబడిపోయి, ఆకాశం మేఘావృత్తమై చిరుజల్లులు కురియడంతో రైతులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న ఆలోచనతో ధాన్యం రాశులు, బస్తాల నెట్టులు సంరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశులు పట్టుబడి చేసి బస్తాలను ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీలైతే ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. వీలుకాకపోతే ధాన్యం రాశులపై రెండు మూడు పొరలు ప్లాస్టిక్ బరకాలు కప్పి దానిపై టార్పాలిన్లు కప్పారు. గాలికి ఎగిరిపోకుండా బరకాలపై మట్టి గడ్డలు, బండరాళ్లు ఉంచారు. సార్వా మాసూళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ముచ్చటగా మూడోసారి వాయుగుండం రైతులను కుదేలు చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు, తుఫాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ గత నవంబర్ రెండో వారం నుంచి చేస్తున్న హెచ్చరికలతో సార్వా కోతలు కోయాలన్నా, మాసూళ్లు ప్రారంభించాలన్నా రైతులు దినదినగండంగా భయపడుతూనే పనులు చేపట్టారు. కొందరు ధైర్యం చేసి యంత్రాలతో కోతలు కోసినా ధాన్యం సరిగ్గా ఆరక తేమ శాతం తగ్గక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయారు. రోజుల తరబడి బరకాలు, పట్టాలు, టార్పాలిన్లు కప్పి ఉంచి ధాన్యం ఎండబెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.



కల్లాల్లో ధాన్యాన్ని, ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం



ధాన్యం రాసులు తడవకుండా టార్పాలిన్లు కప్పిన దృశ్యం

- నవంబర్ 29న అల్పపీడనం తుఫాన్‌గా మారి దాని ప్రభావంతో నాలుగైదు రోజులపాటు వర్షం పడుతూనే ఉంది. ఇది కూడా రైతులను కొంతమేర నష్టపరిచింది,
- డిసెంబర్ 8 నుంచి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడి ఐదారు రోజులు వర్షపు జల్లులు కురవడంతో ఆలశ్యంగా నాట్లువేసిన రైతులు కోతలకు సమాయుత్తం కాగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.
- ఇక తాజాగా డిసెంబర్ 16న సోమవారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా మారి డిసెంబర్ 20వ తేదీ వరకూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనితో చివరి దశలో సార్వా కోతలు కోయాల్సిన కొద్దిపాటి రైతులంతా రెండు రోజులుగా కోతలు నిలిపివేశారు.
- ఇప్పటికే మాసూళ్లుచేసి, ధాన్యం అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్న రైతులు మంగళ, బుధవారాల్లో చిరు జల్లులు పడటంతో బెంబేలెత్తిపోయారు. అష్టకష్టాలు పడి దక్కించుకున్న పంట వర్షంబారిన పడితే మరింత నష్టపోతామన్న ఆందోళనతో రేయింబవళ్లు ధాన్యం రాశులు, బస్తాల నెట్టుల వద్ద కాపలాకాస్తున్నారు.
- ఉంగుటూరు నియోజకవర్గంలో 60వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా ఇప్పటివరకూ 50వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి, ఆలశ్యంగా రెండోసారి నాట్లువేసిన రైతులు ఇప్పుడు కోతలకు ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో వాతావరణం ప్రతికూలంగా మారి వారిని కలవరపెడుతుంది.
- ప్రతికూల వాతావరణ పరిస్థితులు కారణంగా కూలీలకు డిమాండ్ పెరిగింది. ధాన్యం రాసులు పట్టడానికి, ఆరబెట్టిన ధాన్యం పోగుచేసి గోతాల్లో నింపడానికి, ధాన్యం బస్తాలు సమీప రోడ్లు, పుంతలకు చేర్చడానికి, ఎండుగడ్డి ఒబ్బిడి చేయడానికి, గడ్డి మేటగా వేయడానికి ఎక్కుగా కూలీల అవసరం ఏర్పడింది. దీనితో రైతులకు కూలీ ఖర్చులు రెట్టింపయ్యాయి.
- వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు నాలుగైదు రోజులు వరికోతలు కోయరాదని మండల వ్యవసాయఅధికారి యర్రంశెట్టి ప్రసాద్ సూచించారు. గణపవరం మండలంలో మూడు వేల ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందన్నారు. ధాన్యం సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, పటిష్టంగా టార్పాలిన్లు, ప్లాస్టిక్ బర కాలు కప్పి తాళ్లతో గట్టిగా కట్టాలని సూచించారు.

వరి కోతలు నిలిపివేత

రైతులు నవంబర్ రెండో వారం ఆరంభంలో సార్వా మాసూళ్లు ప్రారంభించారు. నవంబర్ 18 అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులపాటు వర్షాలు కురిసి మాసూళ్లకు ఆటంకం ఏర్పడింది. అల్పపీడనం బలపడటంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోత కోయని రైతులు వరి కోత పనులు నిలిపివేశారు.

ఆస్పత్రులకు గీజర్ల వితరణ



భీమడోలు ఆసుపత్రిలో గీజర్లను వైద్యులకు ఎంపీడీవో చేతుల మీదుగా అందిస్తున్న దృశ్యం

భీమడోలు: మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీసాయి స్వచ్ఛంద సేవా సంస్థ పేరిట చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శనీయమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, పూళ్ల వసతి గృహానికి రెండేసి చొప్పున శ్రీసాయి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయంతో రూ.20వేల విలువ గల నాలుగు వాటర్ గ్లీజర్లను ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా సేవా సంస్థ ఏర్పాటై రెండేళ్లు పూర్తయినందున ఇన్ పేషెంట్లకు పండ్లు పంపిణీ చేసారు. సంస్థ నిర్వాహకులు జి.మోహన్, గుంటూరు శ్రీనివాసరావు, గుగ్గులోతు కృష్ణ, కేఎస్ఎస్ ప్రకాశరావు, హెచ్‌ఎం గారపాటి ప్రకాశరావు మాట్లాడుతూ 70 మంది సభ్యులు గల సంస్థలోని ప్రతి ఉద్యోగి నెల జీతంలో కొంత నగదును అందించడం ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరరావు మాట్లాడుతూ సంస్థలోని ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సాయాన్ని అందించడం చాలా సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీలత, ఆపర్ణ, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

నిడమర్రు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పలువురు వినియోగదారులు బుధవారం బువ్వనపల్లి కూడలిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణారావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టగానే విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, అధికారంలోకి వచ్చాక అదే స్మార్ట్ మీటర్లను బిగించేందుకు సిద్ధం కావడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. అనంతరం విద్యుత్ బిల్లులు, జీవోలను దహనం చేసారు. ఈ కార్యక్రమంలో నేతలు గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు, లేవేటి చంద్రరావు, రామవరపు శ్రీను తదితరులున్నారు.



బువ్వనపల్లిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

విద్యుత్ చార్జీలను తగ్గించకుంటే ఆందోళన ఉధృతం

భీమడోలు: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ భీమడోలు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం భీమడోలు సంత మార్కెట్ వద్ద కరెంట్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లో రెండు సార్లు రూ.17వేల కోట్ల భారాలను కరెంట్ ఛార్జీల రూపంలో పేదలపై మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కరెంట్ బిల్లుల ప్రతులను దహనం చేసారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల నిర్వాహకులు కట్టా భాస్కరరావు, ముప్పిరిశెట్టి పానకాలు, కేత నాగమ్మ, బీబీ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పెదపాడు: పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తక్షణమే తగ్గించాలని స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పెదపాడు బళ్ల రేవుతూము సెంటర్‌లో బుధవారం విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేసారు.ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, సీపీఎం శాఖ కార్యదర్శి గుండపనేని సురేష్, నాయకులు లింగం కృష్ణారావు, షేక్ కరీముల్లా, రెడ్డి లక్ష్మణరావు, సీపీఐ నాయకులు గన్ను వెంకటరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే సదస్సుల లక్ష్యం

భీమడోలు: భూసమస్యల పరిష్కారమే గ్రామ సదస్సుల లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మీ భూమి... మీ హక్కు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొని గ్రామ సదస్సుల ఆవశ్యతను వివరించారు. 42 అర్జీలు అందాయని వాటిలో 24 సమస్యలను పరిష్కరించామని అధికారులు తెలిపారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గంధం లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.



భీమడోలులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి

పెదపాడు మండలంలో..

పెదపాడు: వీరమ్మకుంటలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. నాయకులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గోదావరి కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

భీమడోలు: గోదావరి కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నగుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను జలవనరుల అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. గుండుగొలను సెక్షన్ పరిధిలోని కాలువలో వెంబడి ఉన్న వంతెనల వద్ద దట్టంగా పేరుకుపోయిన తూడులను కూలీలు, యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ఈనెల 17వ తేదీ మంగళవారం నీటి ప్రవాహానికి అడ్డంకులు అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు. తూడు తొలగింపు పనులను వేగవంతం చేసారు. గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో సాగు నీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదు. దీనితో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనితో గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ అధికారులు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. జేసీబీ యంత్రాలతో పాటు కూలీలకు ఆ పనులు చేపడుతున్నారు. ప్రధానంగా గుండుగొలను సెక్షన్ కార్యాలయం సమీపంలోని బెయిలీ వంతెన వద్ద తూడు, గుర్రపు డెక్కలను తొలగిస్తున్నారు.



గుండుగొలను బెయిలీ వంతెన వద్ద తూడు తొలగిస్తున్న యంత్రం

బాధిత విద్యార్థి ఆరోగ్యంపై ఎంఈఓ విచారణ

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మధ్య జరిగిన ఘర్షణ కొట్లాటలో గాయపడిన బాధిత విద్యార్థిని బుధవారం పాఠశాలలో దెందులూరు మండలం విద్యాశాఖాధికారి కే.అన్నమ్మ పరామర్శించారు. జరిగిన ఘటనపై పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు ఇద్దరు విద్యార్థులను వేర్వేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి విచారణకు ఆదేశించిన సంగతి విదితమే.

పాల దిగుబడిపై దృష్టి సారించాలి

దెందులూరు: శీతాకాలంలో పాల దిగుబడి తగ్గకుండా ప్రతిరోజు పశువులను గమనించాలని పశుసంవర్థక శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ రాములయ్య అన్నారు. బుధవారం పోతునూరు పశు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ రైతులందరూ దూడలకు, పశువులకు దోమ తెరలు తప్పక ఏర్పాటు చేయాలన్నారు. సాధారణంగా శీతాకాలంలో పశువులన్నీ ఎదకు వస్తాయని సమీపంలోని పశు వైద్యశాలలో చూపించి వైద్య సేవలు పొందాలని సూచించారు.

సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా సుపరిపాలన సాధ్యం

భీమడోలు: సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా గ్రామాల్లో సుపరిపాలన సుసాధ్యమవుతుందని జిల్లా పరిశీలకుడు జి.ప్రసంగరాజు అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించే సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు రెండవ బ్యాచ్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్, ఈవోఆర్డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. భీమడోలు పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్ఈవో కిషోర్ సుస్థిరాభివృద్ధికి సూచించిన అంశాలపై శిక్షణ అందించారు ముఖ్య అతిథులుగా సామర్లకోట నుంచి జిల్లా పరిశీకులు ఎం.చక్రపాణి, జిల్లా డీపీఆర్సీ కోఆర్డినేటర్ జి.ప్రసంగరాజు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిలు పాల్గొని శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ పంచాయతీ పరిపాలనపై పట్టు సాధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సృష్టించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. పంచాయతీలు తమకు రావాల్సిన ప్రతి ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భీమడోలు, పూళ్ల, దుద్దేపూడి, పోలసానిపల్లి, కోడూరుపాడు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.



భీమడోలు సభలో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకుడు జి.ప్రసంగరాజు తదితరులు

సమష్టి కృషితో అభివృద్ధి వేగవంతం

గణపవరం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అన్నిశాఖలూ, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని గణపవరం ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు మండలంలోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఎల్ఎస్‌డీఎస్ పథకం, ప్రజారోగ్య లక్ష్యాలు, హెల్దీ విలేజ్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



గణపవరంలో శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెదపాడు : ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల పనితీరును, ప్రగతిని ఆయాశాఖల అధికారులు వివరించారు. పీఆర్ ఏఈ మురళీ మాట్లాడుతూ మండలంలో పలు అభివృద్ధి పనులకు రూ.329 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీడీవో అమీల్ జామా, తూర్పుకాపు కార్పొరేషన్ డైరక్టరు లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెదపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో పనుల ప్రగతిని వివరిస్తున్న అధికారులు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన మినీ లారీ

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

గణపవరం: బ్రేకుల ఫెయిల్ కావడంతో ఒక మినీ లారీ అదుపు తప్పి ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపడింది. లారీ ఎదురుగా ఉన్న చికెన్ షాపులోకి దూసుకుపోయింది. అక్కడ నిలిపి ఉంచిన రెండు మోటార్ సైకిళ్లు లారీ కింద పడి నలిగిపోయాయి. ఆ సమయంలో అక్కడ జనం ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. తాడేపల్లిగూడెం నుంచి గణపవరం వైపు వస్తున్న మినీ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో వరదరాజపురం మలుపు వద్ద పిప్పర రోడ్డులోకి రావలసి ఉండగా అదుపుతప్పి ఎదురుగా ఉన్న చికెన్‌షాపులోకి దూసుకుపోయింది. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొనడంతో ఆ స్తంభం సగానికి విరిగి లారీపై పడింది, అదృష్టవశాత్తూ విద్యుత్ ప్రమాదం జరుగలేదు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని షాపులోకి దూసుకుపోయిన మినీలారీ

అండర్‌పాస్‌లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: దెందులూరు - అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అండర్‌పాస్ నిర్మించిన నాటి నుంచి నేటి వరకు నీరు తొలగించడానికి పూర్తిస్థాయిలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పాదచారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఆయన ఆశయాలకు అనుగుణంగా విశ్వాసులందరూ కృషి చేయాలని పాస్టర్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ జీవన్ కుమార్ అన్నారు. బుధవారం వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాస్టర్ జీవన్ కుమార్, ప్రిన్సిపాల్, ఏవో అతిథులతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేసి ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ జీవన్‌కుమార్

సెమీ క్రిస్మస్ సందడి

ఉంగుటూరు: యునైటెడ్ పాస్టర్ల అసోషియన్ ఆధ్వర్యంలో బాదంపూడిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లకు కూటమి నాయకులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పూళ్ల సబ్‌స్టేషన్‌లో మొక్కలు తొలగింపు, మరమ్మత్తుల నేపథ్యంలో ఈనెల 20న శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు ఈఈ కేఎం అంబేద్కర్ అన్నారు. భీమడోలులో ఆయన బుధవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసారు. పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధిలోని దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కోడూరుపాడు, పూళ్ల, కుర్లెళ్లగూడెం, ఎంఎంపురం గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

భవానీ భక్తులకు అన్నదానం

ఉంగుటూరు: నారాయణపురం కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో విజయవాడ కాలినడకన వెళ్లే భవానీ భక్తులకు ఉచితంగా అన్నదానం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని సూర్నీడి సంస్థ కన్వీనర్ సూర్నీడి శ్రీనివాసు తెలిపారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.